
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

5 సిద్దిపేట
ఆదివారం 9 నవంబరు 2025

కేబుల్ వైర్ దొంగతనం కేసులో 14 మంది అరెస్ట్

- కేబుల్ వైర్ తో పాటు రూ.2లక్షల నగదు స్వాధీనం
- రిమాండ్ కు తరలించిన వన్ టౌన్ పోలీసులు

8



ఇటాలియన్ ఆర్ట్‌డేకో శైలిలో నిర్మించిన దుబ్బాక దొర రాజా ఉమ్మారెడ్డి భవనం

సండే స్పెషల్ (Sunday Special)

భవన వైభవం

డంగు సున్నపు ఇళ్ల దర్పం

- పల్లెవాకిళ్లలో ఆత్మీయత అల్లుకున్న పొదరిళ్లు
- సంస్కృతికి అద్దం పట్టిన వారసత్వ లోగిళ్లు
- పెళ్లి వారికి విడుదులు.. బంతి భోజనాల భవంతులు
- ఆహ్లాదాన్ని పంచే అపురూపమైన పెంకుటిళ్లు
- కాలంతో కనుమరుగవుతున్న ఆనవాళ్లు

డంగు సున్నంతో కట్టిన ఒకప్పటి ఇళ్లు... కేవలం నివాసాలు కావు, కుటుంబ గౌరవానికి, స్థాయికి ప్రతీకలు. పల్లెల్లో ఆత్మీయతను పంచే ఆ పొదరిళ్లు.. గతకాలపు వారసత్వ చిహ్నాలు. గడీలను పోలిన అధికార దర్పంతో కూడిన ఇళ్లు కొన్ని ఉంటే, వ్యవసాయ ధాన్యగారాలు, వ్యాపార లోగిళ్లుగా ఉన్న ఇళ్లు మరికొన్ని... సువిశాల వరండాతో, విశాల గదులతో ఆహ్లాదాన్ని పంచే పెంకుటిళ్లు ఇంకొన్ని.. పాతబడినా ఆ ఇళ్లు గ్రామాల్లో నేటికీ దర్శనమిస్తున్నాయి. మనోళ్లు మనకందించిన ఆనవాళ్లుగా నిలుస్తున్నాయి.

7



అడవిలో అక్కలు

- మావోయిస్టు పార్టీలో ముగిసిన అన్నల ప్రస్థానం
- ఉమ్మడి జిల్లా నుంచి మిగిలింది ముగ్గురే మహిళలు
- రెండు దశాబ్దాలకుపైగా అజ్ఞాతంలోనే..
- సాయుధ పోరాట విరమణకు వ్యతిరేకం
- లొంగిపోయినవారిలో కానరాని ఆచూకీ

మావోయిస్టు పార్టీ ఉద్యమంలో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన అన్నల ప్రస్థానం ముగిసిపోయింది. ప్రస్తుతం ఈ ప్రాంతానికి చెందిన ముగ్గురు మహిళలు మాత్రమే ఆ పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ ముగ్గురూ ఇరవై ఏళ్ల క్రితమే అజ్ఞాతంలోకి వెళ్లారు. తాజాగా సాయుధ పోరాట విరమణ చేస్తూ లొంగిపోయినవారి జాబితాలోనూ వీరి పేర్లు కానరాలేదు. చావోరేవో ఇక్కడే తేల్చుకుంటామంటూ ఈ ముగ్గురు అక్కలు చెప్పకనేచెప్పినట్లు అర్థమవుతోంది. 50 ఏళ్ల క్రితం ఉమ్మడి జిల్లాలో పురుడుపోసుకున్న విప్లవోద్యమం నేడు కనుమరుగయ్యే పరిస్థితికి చేరడం గమనార్హం.

సంగారెడ్డి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నక్సల్‌బరి పోరాటాలు, పీపుల్స్‌వార్, జనశక్తి, ప్రస్తుత మావోయిస్టు ఉద్యమాలతో ఉమ్మడి మెదక్ జిల్లా, హుస్నాబాద్, చేర్యాల ప్రాంతాలకు విడదీయరాని బంధం ఉంది. దుబ్బాక, నర్సాపూర్, గిరాయిపల్లి, ఇందుప్రియాల్, భూపతి, పద్మక్క దళాలుగా ఇక్కడ పీపుల్స్‌వార్ పనిచేసింది. కూడవెల్లి, మంజీర దళాలతో జనశక్తి హవా నడిచింది. దేశంలోనే మొదటి ఎన్‌కౌంటర్‌కు కొండపాక మండలం గిరాయిపల్లి వేదికైంది. అప్పట్లో అది సంచలనం. నాలుగు దశాబ్దాల పోరాటంలో ఉమ్మడి జిల్లాకు చెందిన వందలాది మంది అడవిబాట పట్టారు. కొందరు నేలకొరగగా.. మరికొందరు లొంగిపోయారు. ఇప్పటికీ మరో ముగ్గురు మహిళలు అజ్ఞాతంలోనే ఉన్నారు.

ముగిసిన 'అన్న'ల ప్రస్థానం

అప్పటి పీపుల్స్‌వార్.. ఆ తర్వాత మావోయిస్టు పార్టీలో కీలకంగా వ్యవహరించిన నేతల్లో చాలామంది ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి తమ ప్రస్థానం ప్రారంభించినవారే. శాఖమూరి అప్పారావు, సోలిపేట కొండాల్‌రెడ్డి, రావుల శ్రీనివాస్, దుబాషి శంకర్, కాతా రామచంద్రారెడ్డి కేంద్ర, రాష్ట్ర కమిటీలకు ప్రాతినిధ్యం వహిస్తూ నేలకొరిగారు. జనశక్తి గ్రూపులో డేగల సుభాష్, రియాజ్, సంగన్న, భీమన్న దళాలూ మెతుకుసీమ పల్లెల్లో హవా సాగించాయి. ఆనాడు గిరాయిపల్లితోపాటు మేదినీపూర్, ఏడుపాయల, రామాయంపేట, ఇందుప్రియాల్, సీతారాంపల్లిలో జరిగిన ఎన్‌కౌంటర్లలో పెద్దసంఖ్యలో నక్సల్స్ చనిపోయారు. వందల సంఖ్యలో ప్రాతినిధ్యం వహించిన అన్నల్లో ప్రస్తుతం ఒక్కరు కూడా లేకపోవడం విడ్డూరంగా మారింది. ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో కోహెడ మండలానికి చెందిన కేంద్ర కమిటీ సభ్యుడు కాతా రామచంద్రారెడ్డి ఎన్‌కౌంటర్‌లో చనిపోగా.. మరో కీలకనేత ధూళిమిట్ట మండలం కూటిగల్‌కు చెందిన కుంకటి వెంకటయ్య సాయుధ పోరాట విరమణలో భాగంగా లొంగిపోయారు. దీంతో పార్టీలో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన 'అన్న'ల ప్రస్థానం ముగిసిపోయింది.

మహిళలే మిగిలారు

- అక్కన్నపేట మండల కేంద్రానికి చెందిన కాశబోయిన స్వరూప పాతికేళ్ల క్రితం అజ్ఞాతంలోకి చేరారు. దండకారణ్యం

మిగతా 7వ పేజీలో





అంతకపేటలో గుంతలను పూడ్చుతున్న చిన్నారులు

భళా బుడతలు

అక్కన్నపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆ చిన్నారులు తలపెట్టిన పనేంటో తెలిస్తే, వారిని అభినందించకుండా ఉండలేరు. చిన్ని వయసులోనే సామాజిక సేవకు నడుంబిగించారు. అక్కన్నపేట మండలంలోని అంతకపేటలో హుస్నాబాద్-జనగామ రహదారిపై గుంతలు ఏర్పడడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణకు స్పందించిన చిన్నారులు తట్ట, పార పట్టుకుని గుంతలు పూడ్చేందుకు పూనుకున్నారు. శనివారం రోడ్డు పక్కన మట్టిని తవ్వి తీసుకువచ్చి గుంతల్లో పోశారు. చిన్నారులు గుంతలను పూడ్చడంతో రహదారిపై వెళ్తున్న బీజేపీ మండల అధ్యక్షుడు రామంచ మహేందర్‌రెడ్డి చూసి వారిని అభినందించారు.

సామూహిక వ్రతాలు

వర్గల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో కార్తీక మాసం సందర్భంగా శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలో 200 వరకు సామూహిక సత్యనారయణ స్వామి వ్రతాలు జరిగాయి. స్వామివారి కల్యాణంలో 18 జంటలు పాల్గొన్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాలతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో హుజూరాబాద్ విరిచి డాన్స్ అకాడమీ పిల్లలు చేసిన భరతనాట్య నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పల్లెర్ల రవీందర్‌గుప్తా, ఆలయ కార్యనిర్వహణాధికారి విజయరామారావు పర్యవేక్షణలో భక్తులకు ఎటువంటి ఇబ్బదులు తలెత్తకుండా పూర్తి ఏర్పాటు చేశారు.



నాచగిరి క్షేత్రంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న దంపతులు

- మద్యం మత్తులో ఘాతుకాలు

తల్లిని చంపిన కొడుకు

మెదక్ జిల్లా వేల్పుగొండలో ఘటన

రెండు నెలల పసికందును ట్రాక్టర్ కింద పడేసిన తల్లి

- చిన్నారిని కాపాడిన గ్రామస్థులు
- పోలీసులకు అప్పగింత
- మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లిలో ఘటన

7

చి(చె)త్తశుద్దేదీ..?

దుబ్బాక మున్సిపల్‌లో అధ్వానంగా పారిశుధ్యం నిర్వహణ

8





బెజ్జంకిలో పత్తికి అంటుకున్న మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

తగలబడిన తెల్లబంగారం

- బెజ్జంకిలో నిప్పంటుకుని పత్తి దగ్ధం
- కాలి బూడిదైన 350 క్వింటాళ్లు

బెజ్జంకి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం శ్రమించి కష్టనష్టాలతో చేతికి అంది వచ్చిన పత్తి పంట ఇంటికి తీసుకువచ్చి అమ్ముకునేందుకు ఆరబెట్టగా ప్రమాదవశాత్తు నిప్పంటుకుని అగ్నికి ఆహుతయింది. దీంతో ఆ రైతు కష్టం బూడిద పాలైంది. ఈ ఘటన శనివారం బెజ్జంకి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. బాధిత రైతు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన బండి ఐలయ్య, తన కుమారులు రమేష్, అనిల్‌తో కలిసి వారికున్న పది ఎకరాల భూమితో పాటు, మరో 20 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి పంటను సాగు చేశారు. పత్తి పంట చేతికి రాగా చేనులో నుంచి ఏరుకు వచ్చిన పత్తిని ఇంటి సమీపంలోని ఖాళీ ప్రదేశంలో ఆరబెట్టారు. ఈ క్రమంలో శనివారం ఆరబెట్టిన పత్తికి ప్రమాదవశాత్తు నిప్పంటుకుని సుమారు 350 క్వింటాళ్ల పత్తి దగ్ధమైంది. రైతు కుటుంబ సభ్యులు, చుట్టు పక్కల వారు గమనించి నీటితో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. పెద్ద ఎత్తున దట్టమైన పొగలు వ్యాపించగా పొగతో కుటుంబసభ్యులు అస్వస్థకు గురయ్యారు. స్థానికులు సిద్దిపేట ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించగా అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది శ్రమించి మంటలను అదుపు చేశారు. అప్పటికే ఆరబెట్టిన పత్తి పూర్తిగా కాలి బూడిదైంది. సుమారు రూ.25 లక్షల వరకు నష్టం జరిగినట్లు బాధిత రైతు కుటంబ సభ్యులు రోదిస్తూ తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

తూకంలో మోసం

లింగాపూర్‌లో పత్తి వ్యాపారులకు రైతుల దేహశుద్ధి

మద్దూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తూకంలో మోసానికి పాల్పడి, కొనుగోలు చేసిన పత్తికి డబ్బు ఇవ్వకుండా సతాయించిన వ్యాపారులకు రైతులు దేహశుద్ధి చేసిన సంఘటన ధూళిమిట్ట మండలం లింగాపూర్‌లో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జగిత్యాల జిల్లా కోరుట్లలోని అయ్యప్పగుట్టకు చెందిన పత్తి వ్యాపారులు ఆనంద్, రవి, హరిప్రసాద్ డ్రైవర్ రూపేష్‌తో కలిసి లింగాపూర్ గ్రామంలో రెండు రోజుల క్రితం 4 డీసీఎంల పత్తిని కొనుగోలు చేశారు. మొదట క్వింటాల్‌కు రూ.6,500 ఇస్తామని చెప్పగా, రైతులు అభ్యర్థన మేరకు క్వింటాలు రూ.7,300 ధర నిర్ణయించి కొనుగోళ్లు చేపట్టారు. వీరు మరలా శనివారం పత్తి కొనుగోలుకు గ్రామానికి వచ్చారు. శనివారం ఓ రైతు కూలీల చేత తూకం వేయించిన 6 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి పెట్టగా, వ్యాపారులు చేసిన కాంటాలో అది 4 క్వింటాళ్లే వచ్చింది. దీంతో అనుమానం వచ్చిన రైతు వెంటనే నిలదీశాడు. నిన్నటి కొనుగోళ్లలో కూడా తూకంలో భారీ మోసం జరిగినట్లు పలువురు రైతులు గుర్తించి, వ్యాపారులను చుట్టుముట్టి ప్రశ్నించారు. తప్పు ఒప్పుకున్న వ్యాపారులు, మోసం చేసిన పత్తికి లెక్కకట్టి రూ.2 లక్షలు చెల్లిస్తామని ఒప్పుకున్నారు. లెక్క సరిచేసిన తర్వాత ఎంతసేపైనా వ్యాపారులు డబ్బు ఇవ్వకపోవడంతో, ఉద్దేశపూర్వకంగా సతాయిస్తున్నారని రైతులు ఆగ్రహించారు. కోపోద్రిక్తులై ముగ్గురు వ్యాపారులకు దేహశుద్ధి చేశారు. అనంతరం బ్యాగులోని తమకు లెక్కకట్టిన రెండు లక్షల రూపాయలను తీసుకుని, మిగిలిన డబ్బుతో ఉన్న బ్యాగును మధ్యవర్తి చేతిలో పెట్టి పంపించారు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. వ్యాపారులను చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం.

సీపీఐలో భగ్గుమన్న విభేధాలు

హుస్నాబాద్‌లో పోటాపోటీగా సమావేశాలు

హుస్నాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మొన్నటి వరకు కమ్యూనిస్టు పార్టీలో అంతర్గతంగా ఉన్న విభేదాలు రచ్చకెక్కాయి. శనివారం హుస్నాబాద్ పట్టణంలోని అనభేరి, సింగిరెడ్డి (కమ్యూనిస్టు పార్టీ) అమరుల భవనం పోటాపోటీ సమావేశాలతో దద్దరిల్లింది. పార్టీ కార్యాలయంలో హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాల కార్యవర్గ, కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. దీనికి సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ హాజరయ్యారు. ఇదే సమయంలో మహిళా సమాఖ్య నియోజకవర్గస్థాయి సమావేశం జరుపగా దీనికి సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్, జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ హాజరయ్యారు. రెండు వర్గాలు ఎదురెదురుగా వేదికలు ఏర్పాటు చేసుకొని పోటాపోటీగా సమావేశాలను కొనసాగించారు.

కొన్నాళ్లుగా అంతర్గత విభేదాలు

హుస్నాబాద్ నియోజకవర్గంలో సీపీఐకి కొంతవరకు పట్టు ఉండగా ఇక్కడి నాయకులు రెండుగా చీలిపోయారు.



ఎదురెదురెదురుగా నిర్వహించిన సమావేశాలు

మొన్నటివరకు ఇవి బయటకు రాకున్నా ఇటీవల అవి బహిర్గతమవుతున్నాయి. ఈనెల 6న హుస్నాబాద్ పట్టణంలోని అనభేరి, సింగిరెడ్డి అమరుల భవనంలో సీపీఐ నియోజకవర్గపరిధిలోని జిల్లా కార్యవర్గ, కౌన్సిల్ సభ్యుల సభ్యుల సమావేశం నిర్వహించారు. దీనికి సీపీఐ జాతీయ మాజీ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు హాజరయ్యారు. తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సమావేశం ఏర్పాటు చేశారని, తన జిల్లా పరిధిలో మూడు మండలాలు ఉండగా ఎందుకు ఆహ్వానించలేదని పార్టీ జిల్లా కార్యదర్శి మంద పవన్ ప్రశ్నించారు. అలాగే పార్టీలో నియోజకవర్గ కమిటీలంటూ ఉండవని, అది కూడా తనకు తెలువకుండా వేశారని పేర్కొన్నారు. ఈక్రమంలో డిసెంబరు 26వ తేదీన ఖమ్మంలో జరిగే బహిరంగసభ కోసం శనివారం నియోజకవర్గస్థాయి మహిళా సమాఖ్య సమావేశం ఏర్పాటు చేసుకోగా దీనిని అడ్డుకునేందుకు ముందుగానే మంద పవన్ మూడు మండలాల కార్యవర్గ, కౌన్సిల్ సమావేశం సీపీఐ భవనంలో ఏర్పాటు చేశారని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్ ఆరోపించారు. మూడు రోజుల ముందే సమావేశాన్ని ప్రకటించామని, దీనిని రసాభాస చేసేందుకు మహిళా సమాఖ్య సమావేశం ఏర్పాటు చేశారని మంద పవన్ వర్గం పేర్కొంది. ఇది ఇప్పటిది కాదని, కొన్ని నెలలుగా ఈ విభేదాలు కొనసాగుతున్నాయని కార్యకర్తలు పేర్కొన్నారు.



విజేతలైన విద్యార్థులకు ట్రోఫీని అందజేస్తున్న రజనీ, నరసింహాచారి తదితరులు

ముగిసిన స్పోర్ట్స్ మీట్

సిద్దిపేట అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజులపాటు కామారెడ్డి, సిద్దిపేట జోన్ లెవల్‌లో సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లిలో నిర్వహించిన గురుకుల విద్యాలయాల స్పోర్ట్స్ మీట్ శనివారం ముగిసింది. 15 గురుకుల కళాశాలల నుంచి 1275 మంది విద్యార్థులు, 30 మంది పీఈటీలు, 60 మంది ఎస్కార్ట్ టీచర్స్ పాల్గొన్నారు. పలు క్రీడాంశాల్లో గెలుపొందిన విద్యార్థులకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకులాల డిప్యూటీ సెక్రటరీ రజనీ బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీవో నరసింహాచారి తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రేశంలో రోడ్డు మరమ్మతులు చేయాలి

పటాన్‌చెరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లుగుంతలమయంగా ప్రయాణం చేయలేని పరిస్థితుల్లో ఉన్నాయని, మరమ్మతులు చేయాలనిత సీపీఎం ఏరియా కమిటీ కార్యదర్శి నాగేశ్వరరావు అన్నారు. శనివారం ఇంద్రేశంలో రిలేనిరాహార దీక్షలు చేపట్టారు.





చరిత్రాత్మకమైన వందేళ్ల చరిత్ర కలిగిన దుబ్బాక పోస్టాఫీస్ భవనం, రామక్కపేట గ్రామంలో శిథిలావస్థలో మిద్దె ఇల్లు

సండే స్పెషల్

భవన వైభవం..



రాఘోత్తంపల్లిలో అందమైన మిద్దె పెంకుటిల్లు

డంగు సున్నం ఇళ్ల దర్పం

- పల్లెవాకిళ్లలో పొదరిళ్లు
- సంస్కృతికి అద్దం పట్టిన వారసత్వ లోగిళ్లు
- పెళ్లి వారికి విడుదులు.. బంతి భోజనాల భవంతులు
- ఆహ్లాదాన్ని పంచే అపురూపమైన పెంకుటిళ్లు
- కాలంతో కనుమరుగవుతున్న ఆనవాళ్లు

దుబ్బాక, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సమష్టి కుటుంబాలకు, ఆత్మీయతకు నిలయాలుగా నిలిచిన ఆనాటి ఇళ్లు పట్టణీకరణ వేగంలో కనుమరుగవుతున్నాయి. ఊళ్లో పెళ్లి సందడి ఉంటే, పెళ్లివారు విడిదిగా ఉండే విశాలమైన వరండా ఉన్న ఇళ్లు... బంతి భోజనాలకు వేదికలైన భవంతులు నేడు కనిపించడం లేదు. పిట్టగూడు ఉన్నా.. పిట్టంత సందడి ఉండాలి అనే నానుడి మారింది. గీత గీసుకుని, ఏకాంతంగా మారిన కాంక్రీట్ భవనాల మధ్య, ఇంకా అక్కడక్కడ మిగిలిన డంగు సున్నంతో నిర్మించిన ఆనాటి ఇళ్లపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

వరండాలు.. భారీ స్తంభాలు

పూర్వీకుల ఆనవాళ్లుగా దుబ్బాక మండలంలోని కొన్ని గ్రామాల్లో డంగు సున్నం ఇళ్లు ఇంకా మిగిలి ఉన్నాయి. సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలో దొరలు నిర్మించిన పోస్టాఫీస్ మినహా పాత నిర్మాణాలు కూల్చివేయబడ్డాయి. దుబ్బాక మున్సిపల్‌లోని లచ్చపేట గ్రామంలో ఈ ఇళ్లు ఎక్కువగా కనిపిస్తాయి. వ్యాపార కేంద్రంగా ఉన్న లచ్చపేటలో, ప్రతీ ఇల్లు స్థాయిని చాటే విధంగా వరండా ఉండేలా, భారీ స్తంభాలతో నిర్మించారు. ఈ ఇళ్ల గోడలు సుమారు 4 అడుగుల వెడల్పుతో అత్యంత పటిష్టంగా ఉంటాయి. ఇంటి పైకప్పు (మిద్దె)ను ఇనుప చువ్వలు, డంగు సున్నంతో నిర్మించేవారు. ఈ నిర్మాణ శైలి వేసవిలో చల్లగా, చలికాలంలో వెచ్చగా ఉండి, వాతావరణానికి అనుగుణంగా ఆహ్లాదాన్ని కలిగిస్తుంది.

కనువిందు చేసే పెంకుటిళ్లు

దుబ్బాక మండలంలో పెంకుటిళ్లు కనువిందు చేస్తాయి. పూర్వీకులు మల్లేశాల, చతుశాల పెంకుటిళ్లను నిర్మించుకున్నారు. వీటిలో విశాలమైన గదులు, మల్లేశాల, వరండా, మండువా లోగిళ్లు, గాలి, వెలుతురు ధారాళంగా ప్రసరించేలా ఉండే నిర్మాణాలు అబ్బురపరుస్తాయి. వ్యాపార వర్గాల ఇళ్లకు వరండా, వాకిలి పెద్దగా ఉంటే, రైతుల ఇళ్లలో కట్టె సజ్జ, కర్రతో నిర్మించే అటుకు, వ్యవసాయ సామగ్రి పెట్టుకునేందుకు, ధాన్యం నిలువ ఉంచేందుకు విశాలమైన గదులు, వసారాలు ఉండేవి. ఈ పెంకుటిళ్లు పలు రకాల ఉంటాయి. మట్టి పెంకు, కుమ్మరి పెంకు, బంగ్లా పెంకు. మట్టి పెంకును కలపతో కూడిన ఫ్రేమ్‌లో బిగించి కూర్పుగా అమర్చారు. బంగ్లా పెంకును ఈ ప్రాంతంలో ఎక్కువగా టేకు కలపతో, గానుగ (డంగు) సున్నంతో కప్పి నిర్మించారు. వీటి పైకప్పుతో పాటు, ఇంటి ముందు భాగంలో చూడడానికి అందమైన కళాకృతుల డిజైన్లు, ఆకర్షణీయమైన తలుపులు, దర్వాజాలు బిగించేవారు. పల్లెల్లో ఒకప్పుడు నిర్మించిన ఈ ఇళ్లు కేవలం నివాసాలు కావు... ఆహ్లాదం పంచే, పూర్వీకుల ఇంజినీరింగ్ ప్రతిభను చాటే లోగిళ్లు!

ఆత్మీయ అనుబంధాల అరుగులు

విశాలమైన వరండాలు, అరుగులు పూర్వం మానవ సంబంధాలకు ప్రతీకగా నిలిచేవి. ఫంక్షన్‌హాళ్లు లేని కాలంలో, పెద్ద వరండా ఇళ్లలోనే వివాహాలు, బంతి భోజనాలు నిర్వహించేవారు. వరుడికి విడిదిగా, పెండ్లి ఎదుర్కోలుకు వేదికగా ఈ ఇళ్లు ఉండేవి. పెళ్లి పందిళ్లు, టెంట్లు లేకపోవడంతో, పెద్ద ఇళ్ల యజమానిని బతిమిలాడి, శుభకార్యాలకు వినియోగించుకునేవారు. ఇరుకైన ఇళ్లు ఉన్నవారు, బంధువులు వచ్చినప్పుడు, పెద్ద ఇళ్ల వరండాలపైనే రాత్రులు పడుకునేవారు. వేసవిలో పెద్ద వరండా ఉన్న ఇంటి ముందే పడక వాల్చేవారు. ఏదేమైనా, కాలంతోపాటు ఆత్మీయతలు దూరమైనట్టుగానే, ఈ ఆత్మీయ లోగిళ్లు కూడా శిథిలమై కనుమరుగవుతున్నాయి.



రామక్కపేట గ్రామంలో మిద్దె ఇల్లు

దుబ్బాక సంస్థాన వైభవం..



ఉమ్మారెడ్డి భవనం

దుబ్బాక సంస్థానాన్ని పాలించిన పస్యాల వంశీయుల పూర్వీకులు, రాజ ఉమ్మారెడ్డి నిర్మించిన ఈ భవనం నేటికీ వారసత్వ చిహ్నంగా నిలుస్తోంది. పూర్వం ఈ ప్రాంతం దోబాగ్ (రాంబాగ్, లక్ష్మన్ బాగ్ అనే రెండు తోటలు)గా ఉండటం వలన దుబ్బాక పేరు వాడుకలోకి వచ్చిందని చెబుతారు. 1930ల మధ్యకాలంలో రాజ ఉమ్మారెడ్డి ఈ భవనాన్ని డంగు సున్నం, ఇనుప మెటీరియల్‌తో రెండు భవంతులుగా నిర్మించారు. ప్రవేశంలో నీటిని చిమ్మే ఫౌంటేన్‌లు, ప్రత్యేక డిజైన్ విండోలు, పెద్ద ద్వారాలు, లాబీలు, గ్యాలరీలు, చుట్టూ గుండ్రటి బాల్కనీలు, అంతర్గత హాల్ దీని ప్రత్యేకతలు. బయటి నుంచి భవనాన్ని అల్లుకుని మెలికలు తిరిగే విశాలమైన మెట్ల ద్వారం ఆకర్షణీయంగా ఉంటుంది. ఈ నిర్మాణం ఆర్ట్ డెకో శైలిలో, కొందరి అభిప్రాయం ప్రకారం ఇటాలియన్ ఆర్కిటెక్చర్ శైలిలో నిర్మించబడింది. దక్షిణ ద్వారం ఉండటం వాస్తు (తూర్పు, ఉత్తర ద్వారాలకు ప్రాధాన్యత ఉంటుంది) ప్రకారం భిన్నంగా కనిపిస్తుంది. ఈ భవనం హైదరాబాద్‌లోని ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయాన్ని పోలి ఉండటంతో, చివరి నిజాం ప్రభువు పర్యవేక్షణలో దుబ్బాక దొరలు దీనిని నిర్మించారని చెబుతారు. వాస్తవానికి హైదరాబాద్ అబిడ్స్‌లోని ఎస్‌బీఐ భవనం కూడా పూర్వం దుబ్బాక దొరలదే. నక్సల్స్ ప్రభావంతో 1980 ప్రాంతంలో దానిని ఎస్‌బీహెచ్ (ప్రస్తుత ఎస్‌బీఐ)కి అద్దెకిచ్చి, ఆ తర్వాత వ్యాపారికి విక్రయించారు. దుబ్బాక దొరలకు ప్రస్తుతం పూర్తిస్థాయి వారసత్వ ఆస్తులు ఇక్కడ లేవు.

రెండు నెలల పసికందును ట్రాక్టర్ కింద పడేసిన తల్లి

- మద్యం మత్తులో ఘాతుకం
- చిన్నారిని కాపాడిన గ్రామస్థులు
- పోలీసులకు అప్పగింత



తల్లికి కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

మనోహరాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కన్నతల్లి మద్యం మత్తులో రెండు నెలల పసికందును చంపేందుకు ప్రయత్నించింది. భర్త పని చేసిన కూలి డబ్బులు ఇవ్వాలని ఇంటికి వచ్చిన గ్రామ పంచాయతీ చెత్త ట్రాక్టర్ సిబ్బందితో వాగ్వాదానికి దిగి.. ఆ ట్రాక్టర్ టైర్ల కిందే చిన్నారిని పడేసింది. అక్కడున్న గ్రామస్థులు చూసి, బిడ్డను రక్షించి పోలీసులకు అప్పగించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మెహతాబేగం, ఎస్సై సుభాష్‌గౌడ్, ఆశా టీచర్ కథనం ప్రకారం.. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన స్వామి, సంధ్య దంపతులు. వీరికి మూడు, ఆరేళ్ల కుమారులు ఉండగా, రెండునెలల క్రితం పాప జన్మనిచ్చింది. సంధ్య భర్త ఇటీవల గ్రామపంచాయతీ చెత్త ట్రాక్టర్‌పై వారం రోజులపాటు పనికి వెళ్లాడు. అయితే, శుక్రవారం వారుంటున్న ఇంటికి గ్రామపంచాయతీ చెత్త ట్రాక్టర్ వచ్చింది. దీంతో తన భర్త వారం పాటు చేసిన పనికి కూలీ ఇవ్వాలని ట్రాక్టర్‌పై వచ్చిన సిబ్బందిని అడిగి గొడవపడింది. తమకు డబ్బుల విషయం తెలియదని, గ్రామపంచాయతీ వారు డబ్బులు ఇస్తారని సమాధానం ఇచ్చారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న సంధ్య రెండునెలల చిన్నారిని చెత్త టైర్లకింద వేసింది. అక్కడున్నవారు గమనించి రక్షించారు. విషయం తెలిసి ఆశా కార్యకర్తల డయల్ 100కు కాల్ చేయగా, పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చారు. తల్లికి కౌన్సెలింగ్ ఇచ్చారు. సంధ్య మద్యానికి బానిసై.. అప్పుడప్పుడు మతిస్థిమితం లేనట్లు వ్యవహరిస్తుందని పోలీసులు, అంగన్‌వాడీ టీచర్ చెప్పారు. తల్లీ, ముగ్గురు పిల్లలను మెదక్ సీడబ్ల్యూసీ కౌన్సెలింగ్ కేంద్రానికి తరలించారు.

మద్యం మత్తులో తల్లిని చంపిన కొడుకు

టేక్మాల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మద్యానికి డబ్బులు ఇవ్వలేదని, పుట్టింటికి వెళ్లిన భార్యను తీసుకురావాలని రోజూ గొడవ పడుతూ మద్యం మత్తులో తల్లిని చంపేశాడో తనయుడు. మెదక్ జిల్లా టేక్మాల్ మండలం వేల్పుగొండ గ్రామంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు టేక్మాల్ ఏఎస్సై కృష్ణ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మోహన్‌గారి సత్తమ్మ(56) కూలీపని చేసుకుంటు జీవనం సాగిస్తుంది. ఆమెకు కూతురు, కుమారుడు ఉన్నారు. కూతురు వివాహం చేసింది. ఆమె కొడుకు సుదర్శన్‌కూ వివాహం చేయగా రోజూ మద్యం తాగి వచ్చి భార్యను వేధించేవాడు. దీంతో మూడేళ్ల క్రితం ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి తన భార్యను తీసుకురావాలని తల్లిని పీడించేవాడు. శుక్రవారం రాత్రి మద్యం తాగి వచ్చిన సుదర్శన్ తల్లితో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో ఇంట్లో ఉన్న కర్రతో కొట్టడంతో ఆమె అక్కడికక్కడే చపోఓయింది. కుమార్తె అనురాధ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

430 గ్రాముల పప్పిస్ట్రా పౌడర్ పట్టివేత

తూప్రాన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా తూప్రాన్ సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద ఎక్సైజ్ అధికారుల తనిఖీలో 420 గ్రాముల నిషేధిత పప్పిస్ట్రా పౌడర్ పట్టుపడింది. ఓ ప్రైవేట్ బస్సులో ఈ పౌడర్ తరలిస్తుండగా పట్టుకున్నట్లు నర్సాపూర్ ఎక్సైజ్ సీఐ గులాంముస్తాఫా పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. రూట్‌వాచ్‌లో భాగంగా తూప్రాన్ జాతీయ రహదారి టోల్‌ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ ప్రైవేటు బస్సులో రాజస్థాన్‌కు చెందిన రావల్‌సింగ్ వద్ద 420 గ్రాముల పప్పిస్ట్రా పౌడర్ లభించింది. పౌడర్ స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులో తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. రాజస్థాన్ నుంచి పౌడర్ తీసుకొస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ పౌడర్ డాబా హోటళ్లలో తయారయ్యే తినుబండారాల్లో వినియోగిస్తారని సమాచారం. ఈ తనిఖీలో ఎక్సైజ్ ఎస్ఐలు ఖాజా అజీజ్‌అహ్మద్, రాఘవేందర్‌రావు, సిబ్బంది అనిల్, సత్తయ్య, ప్రభాకర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అదృశ్యమైన యువకుడు శవమై తేలాడు



అనిల్‌రెడ్డి(ఫైల్)

నారాయణఖేడ్/నాగల్‌గిద్ద, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రెండురోజుల క్రితం అదృశ్యమైన యువకుడు మంజీరానదిలో శవమై తేలాడని నారాయణఖేడ్ ఎస్ఐ రావుల శ్రీశైలం శనివారం తెలిపారు. నాగల్‌గిద్ద మండలం ఏనక్‌పల్లి గ్రామానికి చెందిన ఊస అనిల్‌రెడ్డి(22) నారాయణఖేడ్‌లోని ఓ ప్రైవేటు వ్యాపార సంస్థలో పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులకు తోడు సొంత వ్యాపారం చేసుకుంటానని కుటుంబసభ్యులతో చెప్పేవాడు. ఈనెల 6న నారాయణఖేడ్‌లో నివాసముంటున్న గది నుంచి తెల్లవారుజామున వెళ్లి తిరిగిరాలేదు. దీంతో అనిరెడ్డి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కాగా మనూరు మండలం రాయిపల్లి సమీపంలో మంజీరానది వద్ద అతడి వాహనం కనిపించింది. రెండురోజులుగా ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందితో నదిలో గాలించినా ఫలితం దక్కలేదు. శనివారం ఉదయం కూడా గాలించేందుకు వెళ్లగా అనిల్‌రెడ్డి మృతదేహం మంజీరా నదిలో తేలింది. ఈ మేరకు కేసు నమోదు చేసి నారాయణఖేడ్ ఏరియా వైద్యశాలలో శవ పరీక్ష చేయించి, కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో పరిశ్రమలో అగ్నిప్రమాదం

- కాలిబూడిదైన సామగ్రి
- రూ. 20 లక్షల మేర ఆస్తినష్టం



కాలిపోయిన పరిశ్రమను పరిశీలిస్తున్న సిబ్బంది

మనోహరాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కూచారం గ్రామ పరిధి దిల్లాయి సైకిల్ పరిశ్రమలో శనివారం విద్యుదాఘాతంతో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాలేదు. ఇందుకు సంబంధించి వివరాలు.. కూచారం గ్రామ పరిధిలో దిల్లాయి మొబిలిటెడ్ ప్రైవేట్ లిమిటెడ్ సైకిల్ పరిశ్రమ ఉంది. పరిశ్రమలో సైకిళ్లు తయారు చేస్తారు. శనివారం పరిశ్రమలో విద్యుదాఘాతంతో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో పరిశ్రమలోని సామగ్రితో పాటు కార్యాలయం దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ. 20 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. ఉదయం ఏడు గంటల ప్రాంతంలో అగ్ని ప్రమాదం జరిగడం, కార్మికులు పది గంటలకు విధులకు వస్తుండంతో వారు రాకముందే ప్రమాదం జరిగింది. అగ్నిప్రమాదం విషయం తెలియగానే చుట్టుపక్కల మండలాల నుంచి మూడు ఫైర్ ఇంజన్లు వచ్చి మంటలను ఆర్పివేశాయి. మనోహరాబాద్ ఎస్సై సుభాష్‌గౌడ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

సాహిత్య కార్యక్రమాల్లో ప్రతిభ చూపాలి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న బహుమతి

కంది, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి సాహిత్య కార్యక్రమల్లో విద్యార్థులు ప్రతిభ చాటాలని ఉమ్మడి జిల్లా రీజనల్ లెవల్ కోఆర్డినేటర్ బహుమతి అన్నారు. తెలంగాణ మైనార్టీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో నిర్వహించిన స్పార్క్ ఫెస్ట్-2025 (సాహిత్య పోటీలు) శనివారం కందిలోని మైనార్టీ గురుకుల బాలుర పాఠశాలలో నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్ (వాద-ప్రతివాద), పాటల, క్విజ్, వక్తృత్వ, సృజనాత్మక సాహిత్య కార్యక్రమాలకు సంబంధించిన పోటీలు నిర్వహించారు. ఆయా విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 30 మంది విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికచేసి పంపుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతీ విద్యార్థికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు గౌస్, జగదీష్‌రెడ్డి, స్కూల్ ప్రిన్సిపాల్ కవిత, అకడమిక్ కో ఆర్డినేటర్ వసీముద్దీన్, ఉమ్మడి మెదక్ జిల్లాలోని గురుకులాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాతూర్ సీడ్స్ కంపెనీపై కేసు

- రైతులతో ఒప్పందం చేసుకునే 4547 రకం వరి వంగడం సాగు
- రుక్మాపూర్‌లో పంటనష్టంపై క్షేత్రస్థాయిలో విచారణ
- జిల్లా వ్యవసాయాధికారి దేవ్‌కుమార్ వెల్లడి

మెదక్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విత్తన ఏజెన్సీ పాతూర్ సీడ్స్ కంపెనీపై నకిలీ విత్తనాలు రైతులకు సరఫరా చేసినట్లు ఆరోపణలు వస్తున్న దృష్ట్యా ప్రస్తుతానికి రైతుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి దేవ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ చేగుంట మండలంలోని రుక్మాపూర్‌లో పలువురు రైతులు సుమారు 100 ఎకరాల్లో 4547 రకం వరి వంగడాన్ని వేశారని తెలిపారు. తీరా చేతికొచ్చే దశలో కొంతమేర పంట నష్టపోయినట్లు సమాచారం అందిందన్నారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపితే వాస్తవాలు వెల్లడవుతాయని వివరించారు. ప్రస్తుతం మేకల శ్రీనివాస్‌కు చెందిన రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో వరిపంట ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. విత్తన సంస్థ యాజమాన్యం రైతులతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకే వ్యవసాయ క్షేత్రాలలో పంట పరిశోధనలు చేస్తారని అన్నారు. రైతులకు యాజమాన్యంచే పరిహారం ఇప్పించే ప్రయత్నం చేస్తామని తెలిపారు. పాతూర్ సీడ్స్ ఆర్గనైజర్‌తో తమ అధికారులను మాట్లాడమని ఆదేశించినట్లు వివరించారు. మరో రెండురోజుల్లో పూర్తిస్థాయి నివేదిక కలెక్టర్‌కు నివేదిస్తామని వెల్లడించారు. మెదక్ జిల్లాలో అనేక విత్తన సంస్థలు ఆడ, మగ వరి వంగడాలపై పరిశోధనలు నిర్వహిస్తున్నాయి. వ్యవసాయ అధికారులు వాటిపై ఉదారంగా వ్యవహరిస్తుండడంతో రైతులకు చెల్లించాల్సిన పంట డబ్బుల కోసం కంపెనీ యజమానుల చుట్టూ తిరగాల్సి వస్తోందని పలువురు రైతులు వాపోతున్నారు.

వైభవంగా ఆలయ బ్రహ్మోత్సవాలు

- తొలిరోజు పుణ్యావాచకం, పుట్ట బంగారం, హోమం
- నేడు రుక్మిణీ పాండురంగ కల్యాణం



కంది : ఆలయ ఆవరణలో పుట్ట బంగారం సేకరిస్తున్న వేదపండితులు

కంది, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కంది మండల కేంద్రంలోని రుక్మిణీ పాండురంగస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్తలు దీపక్ దేశ్‌ముఖ్, సునీల్ దేశ్‌ముఖ్ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోశ్చరణల మధ్య పుణ్యావాచకం, పంచగవ్య సమ్మేళనం, పుట్ట బంగారం సేకరణ, హోమం, ఎదుర్కోలు, బలిహరణ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల రాకకోసం కందిలోని పురవీధుల్లో భారీఎత్తున స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారి కల్యాణం, సోమవారం గరుడ సేవ నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పండితులు మధుసూదన్‌రావు పంతులు, శ్రీనుపంతులు, సురేష్ పంతులు, గ్రామస్థులు జంగయ్య, యాదగిరి, శ్రీను పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షికోత్సవం


సంగారెడ్డి అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని శ్రీనగర్‌లో లక్ష్మీనరసింహస్వామి ఆలయ 4వ వార్షికోత్సవాలు శనివారం ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం, లక్షపుష్పార్చన, కల్యాణం, దీపోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు మహా అన్నప్రసాద వితరణ చేశారు.

హనుమాన్ ఆలయాలకు భక్తుల తాకిడి

నారాయణఖేడ్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కార్తీక శనివారాన్ని పురస్కరించుకుని నారాయణఖేడ్ ప్రాంతంలోని పలు హనుమాన్ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చరిత్రాత్మకమైన కొండాపూర్ హనుమాన్ ఆలయంలో ఉదయం అభిషేకం, చందనం, మహాహారతి, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాంమహరాజ్ ఆశీస్సులు అందించి, దాతల సహకారంతో మహాప్రసాదాన్ని అందించారు. కాగా ఖేడ్ పట్టణంలోని కల్పనా హనుమాన్, మంగల్‌పేట హనుమాన్, సిరూర్ కాలనీలోని శివపంచాయతన అభయాంజనేయస్వామి, డోవూరు లొంక హనుమాన్ ఆలయాల్లోనూ భక్తుల రద్దీ కనిపించింది.



లక్షపుష్పార్చన పూజలందుకున్న లక్ష్మీనరసింహస్వామి



వర్గల్ : స్వామివారి నామాల ఆకృతిలో దీపారాధన చేసిన భక్తులు

నామాల ఆకృతిలో దీపారాధన

వర్గల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో కార్తీక మాసం సందర్భంగా దేవాదాయ ధర్మాదాయశాఖ ఆదేశాలతో శనివారం సాయంత్రం నిర్వహించిన నిత్య కార్తీక దీపోత్సవంలో భాగంగా భక్తులు స్వామివారి నామల ఆకృతిలో దీపారాధన చేశారు.

అడవిలో అక్కలు

(5వ పేజీ తరువాయి)

సభ్యురాలిగా ఉన్న ఆమెపై రూ.2లక్షల రివార్డు ఉంది. చిన్ననాడే తల్లిదండ్రులు చనిపోతే నానమ్మ, తాత వద్ద పెరిగింది. పదో తరగతి చదువుతున్నప్పుడే ఉద్యమానికి ఆకర్షితురాలై అడవిబాట పట్టింది. నానమ్మ, తాత చనిపోతే గ్రామస్థులే చందాలు వేసి అంత్యక్రియలు చేశారు. ప్రస్తుతం తనకు చెల్లె మాత్రమే ఉంది.

- నంగునూరు మండలానికి చెందిన రంగు అరుణ అలియాస్ పద్మక్క 20 ఏళ్లుగా మావోయిస్టుల్లో ఉన్నారు. ఛత్తీస్‌ఘడ్‌లోని దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీలో యాక్షన్‌టీం మెంబర్‌గా ఉన్న పద్మక్కపై రూ.2లక్షల రివార్డు ఉంది. అరుణ తల్లి అనారోగ్యానికి గురై మంచం పట్టింది. కూతురు ఎక్కడుందో.. ఎలా ఉందో తెలియదని చెబుతోంది. బంధువులకు కూడా ఎలాంటి సమాచారం లేదని తెలుస్తోంది.

- మిరుదొడ్డి మండలం ధర్మారంకు చెందిన రంగనబోయిన భాగ్య అలియాస్ కల్పన అలియాస్ రూపి 23 ఏళ్లుగా వివిధ హోదాల్లో మావోయిస్టు పార్టీలో కొనసాగుతున్నారు. ప్రస్తుతం నార్త్ బస్తర్ ప్రతాపూర్ ఏరియా కమాండర్‌గా ఉన్న భాగ్యపై రూ.4 లక్షల రివార్డు ఉంది.

చి(చె)త్తశుద్దేదీ..?

దుబ్బాక, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక మున్సిపల్‌లోని వివిధ వార్డుల్లో పారిశుధ్యం అధ్వానంగా మారింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన స్వచ్ఛసర్వేక్షణ్ 2024-25లో జరిగిన సర్వేలో రాష్ట్రస్థాయిలో 97వ ర్యాంకును, జాతీయ స్థాయిలో 943వ ర్యాంకును సాధించి, అభాసుపాలైంది. చెత్త నిర్వాహణ చెత్తగానే ఉందంటూ, పరోక్షంగా ర్యాంకు సూచిక వెక్కిరించినంత పనిచేసినప్పటికీ, దుబ్బాక మున్సిపల్ తీరు మారడంలేదు. దుబ్బాకలోని అన్ని వార్డుల్లో రహదారులకు ఇరువైపుల చెత్తను విచ్చలవిడిగా పారవేస్తున్నారు. బహిరంగ మలవిసర్జన, రోడ్లపక్కన చెత్త వేయడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.





దుబ్బాకలోని బైపాస్ వద్ద ప్రైవేటు విద్యాసంస్థల వద్ద చెత్త, మున్సిపల్ దుకాణాల సముదాయం వద్ద మురికి కాలువల్లో పేరుకుని పోయిన చెత్త

నిధుల విడుదల సకాలంలో ఉంటే, చెత్తనిర్వాహణ చెత్తగా ఉండదని ప్రజలంటున్నారు.

పొలాల్లో వేలాడుతున్న విద్యుత్ వైర్లు

ఆందోళనలో రైతులు

మద్దూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పొలాల్లో వేలాడుతున్న విద్యుత్ వైర్లు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. స్థానిక లైన్‌మెన్లు తమకేమి పట్టనట్టుగా వ్యవహరిస్తుండటంతో వరి పంట సాగు చేసిన రైతుల ఆందోళన అంతా ఇంతా కాదు. మద్దూరు మండలం వల్లంపట్ల, రేబర్తి గ్రామ రైతులు బచ్చల నర్సింహులు, నారదాసు ఐలయ్య తమ పంటలను కోసుకోలేని దుస్థితి ఏర్పడింది. పలుమార్లు స్థానిక విద్యుత్ లైన్‌మెన్లకు సమాచారం అందించినా పట్టించుకోవడం లేదని, పంట చేతికొచ్చి కోసుకోలేని పరిస్థితులున్నాయని ఆందోళన చెందుతున్నారు. వల్లంపట్లలో విద్యుత్ వైరు తెగిపడటంతో విద్యుత్ పోల్‌కు ట్యూబ్‌తో కట్టేసినట్లు తెలిపారు. రేబర్తిలో వేలాడుతున్న వైర్లను సరి చేయాలని చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. వరికోత విషన్‌తో పంట కొయించలేని పరిస్థితులున్నాయని, ముంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలతో పొలాల్లో నీళ్లుండటంతో కోయించలేని దుస్థితితో పాటు వరికోత మిషన్లు వస్తే వేలాడుతున్న విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయని వాపోతున్నారు. వెంటనే విద్యుత్ వైర్లను సరిచేసి పంటకోతలకు సహకరించాలని కోరుతున్నారు.



రేబర్తిలో చేతికందె ఎత్తు పొలంలో వేలాడుతున్న విద్యుత్ వైరు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

రాయపోల్/కుకునూరుపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పలు గ్రామాలకు చెందిన వారికి శనివారం రాష్ట్ర మాజీ సభ్యుడు దేవి రవీందర్ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజే శారు. లకుడారం గ్రామానికి చెందిన రాచకొండ తేజస్వినికి రూ. 24వేలు, రాచకొండ మనెమ్మకి రూ. 34వేలు, మర్పడగ గ్రామానికి చెందిన ఎండి ముస్తఫాకి రూ. 16వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో దేవి నరసింహులు, కంకణాల నరసింహులు, చిక్కుడు నరసింహులు ఉన్నారు.

రాయపోల్‌లో



రాయపోల్‌లో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముఖ్యమంత్రి సహాయనిధి పేదల వైద్యానికి ఎంతో చేయూత నిస్తుందని రాయపోల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్ పేర్కొన్నారు. శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని రాయపోల్‌లో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసి కేక్‌కట్ చేశారు. అనంతరం టపాకాయలు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మంతూరుకు చెందిన బండారు శ్రీనివాస్‌కు రూ. 55వేలు. తొడంగల మల్లయ్యకు రూ. 47,500, తిమ్మక్కపల్లికి చెందిన కాశిరెడ్డి మంజులకు రూ. 60వేలు, ముంగిసపల్లికి చెందిన భూపతిరావుకు రూ. 60వేలు సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు కాగా వాటిని లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిష్టారెడ్డి, రామాగౌడ్, ప్రసాద్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అధిక వర్షాలతోనే పూత నిలువలేదు

మద్దూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నకిలీ పత్తి విత్తనాలతో నష్టపోయిన రైతు బెల్లి వెంకటయ్య పత్తి పంటను శనివారం జనగామకు చెందిన బయోసీడ్ సేల్స్ ఆఫీసర్ ఆంజనేయులు, ఫర్టిలైజర్ ప్రసాద్, శ్రీరామ ఫర్టిలైజర్ షాపు నిర్వాహకుడు సంపత్‌తో కలిసి పరిశీలించారు. పత్తి చేనుకు పూత దశలో అధిక వర్షాలు రావడంతో పూత రాలిందని, దీంతో పాటు పీటుకు పీటు మధ్య దూరం తక్కువగా ఉండటంతో గాలి ఆడక సమస్యలు వచ్చాయని తెలిపారు. చేను ఎదగడంలో లోపం లేదని, సరైన సమయానికి మందులు వాడినా అధిక వర్షాలతో ఇబ్బందులు ఏర్పడటంతో పత్తి దిగుబడి ఆశించనంతగా లేకుండా పోయిందని తెలిపారు. ఈ విషయమై రైతు బెల్లి వెంకటయ్య మాట్లాడాడు . ఫర్టిలైజర్ షాపు నిర్వాహకుల చెప్పిన మాదిరిగా ఎకరాకు మూడు విత్తన ప్యాకెట్లు వేయాలని చెప్పడంతో 5ఎకరాలకు 15 ప్యాకెట్లతో పాటు సమయానుకూలంగా మందులు వాడాలని చెప్పిన విధంగా చేసినట్లు తెలిపారు. తాను పూర్తిగా నష్టపోయినట్లు తెలిపారు. నష్టపరిహారం అందించి ఆదుకోవాలని లేకపోతే ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితులున్నాయని ఆందోళన వ్యక్తం చేశాడు. ఈ విషయమై ఏవో రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లడంతో సైంటిస్టులను రప్పించి పంటను పరిశీలింపజేయనున్నట్లు తెలిపారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న బయోసీడ్ సేల్స్ ఆఫీసర్

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఏబీవీపీ ఆందోళన

హుస్నాబాద్ టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని హుస్నాబాద్ పట్టణంలోని శనివారం ఏబీవీపీ నాయకులు ఆందోళన నిర్వహించారు. పట్టణంలోని మంత్రి పొన్నం ప్రభాకర్ క్యాంపు కార్యాలయానికి వెళ్తున్న ఏబీవీపీ నాయకులను పోలీసులు అడ్డుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం ఇవ్వడానికి వెళ్తున్న తమను పోలీసులు అత్యుత్సహంతో అరెస్ట్ చేయడం సరికాదన్నారు. ఈ ప్రజా ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ కార్యాలయమైన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి విద్యార్థులు వెళ్ళే హక్కు లేదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా హాస్టల్స్ కన్వీనర్ రాజేశ్, నగర కార్యదర్శి చరణ్, రాముల్, రాజు, అంజి సంతోష్ తదితరులున్నారు.

ఆర్ఎంపీని కోర్టులో హాజరు పరచిన పోలీసులు

కొమురవెల్లి నవంబర్ 8 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగపురి గ్రామంలో అర్హత లేని వైద్యం చేస్తున్న సిరిగారి జనార్ధన్‌ను కోర్టులో హాజరు పరచినట్లు ఎస్సై రాజు గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3న తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అందించిన దరఖాస్తు మేరకు అనుమతి లేకుండా క్లినిక్ నడుపుతూ వైద్యం చేస్తున్నందుకు కొమురవెల్లి పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేసి సాక్ష్యాధారాలను సేకరించిన తరువాత శనివారం కోర్టులో పోలీసులు హాజరు పరిచారు.

కేబుల్ వైర్ దొంగతనం కేసులో 14 మంది అరెస్ట్

- కేబుల్ వైర్‌తో పాటు రూ.2లక్షల నగదు స్వాధీనం
- రిమాండ్ కు తరలించిన వన్ టౌన్ పోలీసులు

సిద్దిపేట క్రైం నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలో బీఎస్ఎన్ఎల్ కేబుల్ వైర్ దొంగతనం కేసులో 14మంది నిందితులను వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన విషయాలను సీఐ వాసుదేవరావు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో ఈనెల మూడవ తేదీన బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ వద్ద గుర్తుతెలియని వ్యక్తులు కాపర్ కేబుల్ వైర్ ను దొంగలించారు. బీఎస్ఎన్ఎల్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పుగోదావరి జిల్లాకు చెందిన 12 మంది, ఇద్దరు బాల నేరస్తులు మొత్తం 14 మంది కలసి బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ వద్ద కేబుల్ వైర్ దొంగతనం చేసి బోధన్‌కు వెళ్లి అక్కడ బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ వద్ద కేబుల్ వైర్ దొంగతనం చేసి తిరిగి పెద్దపల్లికి వెళ్తున్నారు. ఈ క్రమంలో సిద్దిపేట పట్టణ శివారులోని నాగదేవత గుడి చౌరస్తాలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా అనుమానస్పదంగా కనబడిన 14 మందిని అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకోగా అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఒక గూడ్స్ బొలెరో ఆటో, 260 మీటర్ల బీఎస్ఎన్ఎల్ కేబుల్ వైర్లు, పది గడ్డపారలు, రెండు బెజ్జల పాటలు, 12 పారలు, 8 సెల్ ఫోన్లు, రూ.2 లక్షల నగదు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

మండల సమాఖ్యలో అమ్మకి అక్షర మాల కార్యక్రమం



వర్గల్ మండల సమాఖ్యలో అమ్మకి అక్షర మాల కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్న సీఆర్‌పీలు

వర్గల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ మండల సమాఖ్య భవనంలో అమ్మకి అక్షరమాల కార్యక్రమంలో భాగంగా సమాజంలో అందరికి జీవిత కాల అభ్యాసంపై అవగాహణ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీనియర్ సీఆర్‌పీలు సుమలత, జనగాం జిల్లా నుంచి వచ్చిన అరుణతో పాటు ఇతర జిల్లాల నుంచి వచ్చిన సీఆర్‌పీలు మండలంలోని ఉన్న 35 గ్రామ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, వీవోఏలకు శిక్షణ ఇవ్వడమైంది. ఈ కార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రేణుక, ఏపీఎం కిరణ్‌కుమార్, సీసీలు సత్యనారయణ, నర్సింలు, స్వామి, సాయిలు, స్వర్ణలత, వసంత, అకౌంటెంట్ లత, కంప్యూటర్ ఆపరేటర్ విష్ణు తదితరులు ఉన్నారు.

దుద్దెడలో ఉచిత హోమియోపతి వైద్య శిబిరం

కొండపాక, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రామంతపూర్ ధర్మ కిరణ్ ప్రభుత్వ హోమియో ఆసుపత్రి, ప్రభుత్వ ఆయుష్ విభాగం సిద్దిపేట వారి ఆధ్వర్యంలో శుక్రవారం దుద్దెడలో నిర్వహించిన ఉచిత హోమియోపతి వైద్య శిబిరం విజయవంతం అయింది. ఈ శిబిరంలో వైద్య బృందం దీర్ఘకాలిక వ్యాధులకు కీళ్ల నొప్పులకు, షుగర్, థైరాయిడ్, శ్వాసకోశ వ్యాధులుచర్మ వ్యాధులు పులిపిర్లు, అజీర్తి, పైల్స్ మొదలగు వ్యాధులకు చికిత్స చేశారు. ఈ క్యాంపు నందు 129 పురుషులు, 153 స్త్రీలు,32 పిల్లలు మొత్తంగా 314 మంది రోగులు చికిత్సలు పొందారు. ఈ శిబిరంలో 182 రోగులకు హిమోగ్లోబిన్, బ్లడ్ గ్రూపింగ్, షుగర్ పరీక్షలు నిర్వహించినట్లు ఇన్‌చార్జి డాక్టర్ కే.అనిల్ కుమార్ తెలిపారు. ధర్మ కిరణ్ ప్రభుత్వ హోమియో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.సౌమ్యా, సీనియర్ డాక్టర్ జి. లలిత,సిద్దిపేట ఆయుష్ విభాగం నుంచి డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ పి.కవిత, డాక్టర్ బి.శ్రీ ప్రియ, డీకే ప్రభుత్వ హోమియో ఆసుపత్రి వైద్యులు,జె ఎస్ పి ఎస్ హోమియో వైద్యశాల పీజీ డాక్టర్లు జూనియర్ డాక్టర్లు చికిత్సను అందజేశారు.

ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు



సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు

రేవంత్‌రెడ్డిని కలిసిన కొన్యాల బాల్‌రెడ్డి



హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కొన్యాల బాల్‌రెడ్డి



మద్దూరులో సీఎం జన్మదిన కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఆలయ రాజగోపురం ఎదుట జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

న్యూస్‌నెట్‌వర్క్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోసీఎం రేవంత్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు శనివారం కాంగ్రెస్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యదర్శులు కేక్ కట్ చేశారు.

దుమ్ము,ధూళి బెడద తీర్చాలని ఆందోళన

చేర్యాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గాంధీచౌక్ వద్ద నత్తనడకన హైలెవల్ కల్వర్టు పనులు కొనసాగుతున్న క్రమంలో దుమ్ము, ధూళి వెదజల్లుతుండటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ సమీప జనావాసాలు, దుకాణాదారులు శనివారం ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ రోడ్డువిస్తరణ, కల్వర్టు నిర్మాణంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా ఎన్‌హెచ్ అధికారులు పట్టించుకోకపోవడం తగదన్నారు. కంకర చూర మిశ్రమం పోసినా వాటర్ పట్టకపోవడంతో వాహనాల రాకపోకలతో దుమ్ము,ధూళి వెదజల్లుతుండటంతో తీవ్ర ఇబ్బందులుపడుతున్నామని వాపోయారు. ప్రతిరోజూ నీళ్లుపట్టాలని తెలిపినా కాంట్రాక్టర్ సంబంధీకులు పొంతనలేని మాటలతో వ్యవహరిస్తున్నారన్నారు. వెంటనే తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలిసిన పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన విరమింపచేశారు.



గాంధీచౌక్ వద్ద ఆందోళన చేస్తున్న స్థానికులతో మాట్లాడుతున్న పోలీసు సిబ్బంది

కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ విమర్శలు.. ప్రతి విమర్శలు



దౌల్తాబాద్: మొక్కజొన్నల కొనుగోలుపై మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దెల స్వామి, బండారు లాలు, రైతన్న

దౌల్తాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం దౌల్తాబాద్‌లో మొక్కజొన్నల కొనుగోలు మార్కెట్ ఏర్పాటు చేయలేక కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలపై, ప్రజా ప్రతినిధులపై మార్కెట్ ఛైర్మన్లపై నిందలు ఎలా మోపుతారని దౌల్తాబాద్ మండల పీఎసీఎస్ ఛైర్మన్ వెంకటరెడ్డి, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ రహిమోద్దీన్, బండారు దేవేందర్ విమర్శించారు. శనివారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, మద్దెల స్వామి బండారు లాలు విలేకరులతో మాట్లాడుతూ. దౌల్తాబాద్ మండలంలోని మొక్కజొన్నలు కొనుగోలు చేయడంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పీఎసీఎస్ ఛైర్మన్ వెంకట్ రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిలు విఫలమయ్యారని, విమర్శించారు. తదనంతరం విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు, సయ్యద్ రహీమొద్దీన్, పిఎ సిఎస్ ఛైర్మన్ వెంకటరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎంపీటీసీ బండారు దేవేందర్ విలేకరులతో మాటాడారు.

శనివారం దౌల్తాబాద్ మండల పరిధిలోని శేరి పల్లి బందారం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దెల స్వామి బండారు లాలు రైతన్న విలేకరులతో మొక్కజొన్నల కొనుగోలు పై మాట్లాడుతూ. దౌల్తాబాద్ మండల కేంద్రంలోని మొక్కజొన్నల మార్కెట్ కేంద్రం ఏర్పాటు చేయగా మొక్కజొన్నలు కొనుగోలు చేయలేక పోవడంలో దౌల్తాబాద్ పిఎస్ ఛైర్మన్ వెంకటరెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఇద్దరు అసమర్థులేనని, మొక్కజొన్నలు కొనుగోలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

అక్కన్నపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అక్కన్నపేట మండలంలోని గౌరవెల్లి గ్రామంలోని వాటర్ ప్లాంట్ ఎదురుగా డబల్ రోడ్డు నిర్మాణంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ గద్దె ఎత్తు తగ్గిపోవడంతో ప్రమాదకరంగా ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉండటంతో అటుగా వచ్చే వరద నీరు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చేరడంతో ప్రమాదం సంభవించే అవకాశం ఉన్న కూడా విద్యుత్ ఆధికారులు పట్టించుకోవడం లేదంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎలాంటి ప్రమాదం సంభవించక ముందే సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు స్పందించి గద్దె నిర్మించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



అక్కన్నపేట మండలం గౌరవెల్లిలో ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

సీపీఐ శతజయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్

హుస్నాబాద్,/ సిద్దిపేట అర్బన్/ నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీపీఐ శత జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మంద పవన్ పిలుపునిచ్చారు.శనివారం ఆయన హుస్నాబాద్ పట్టణంలోని అనభేరి, సింగిరెడ్డిల అమరుల భవనంలో విలేకరులతో మాట్లాడారు. సీపీఐ శత జయంతి ఉత్సవాల ముగింపు సభ డిసెంబరు 26వ తేదీన ఖమ్మంలో జరుగుతుందని, దీనికి జిల్లా నుంచి 3 వేల మందిని తరలిస్తున్నామన్నారు. కగార్ అపరేషన్‌ను నిలిపి వేసి మావోయిస్టులతో చర్చలు జరుపాలని డిమాండ్ చేశారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈ నెల 17న సిద్దిపేట జిల్లాకు వస్తున్న పార్టీ జాతను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సీపీఐ నాయకులు కిష్టాపురం లక్ష్మణ్ అన్నారు.

సీఐటీయూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

సిద్దిపేట అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీఐటియు రాష్ట్ర ఐదవ మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు చుక్కా రాములు అన్నారు. శనివారం సిద్దిపేటలో జరిగిన సిఐటియు జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబరు 7, 8, 9వ తేదీలలో ఉమ్మడి జిల్లా కేంద్రం మెదక్ మహాసభలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

10 నుంచి కొండపోచమ్మ వార్షికోత్సవాలు

- మూడు రోజులపాటు నిర్వహణ

జగదేవ్‌పూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పచ్చనిపంట పొలాలు, పక్షుల కిలకిల రాగాలు, ఎత్తయిన నల్లని నాపరాతి గుట్టల నడుమ జగన్మాత శీతలాదేవి కొలువైన కొండపోచమ్మ దేవస్థానం తెలంగాణలో ప్రసిద్ధి గాంచినది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం జగదేవ్‌పూర్ మండలం తిగుల్‌నర్సాపూర్ సమీపంలో ఆలయం ఉంది. 400 సంవత్సరాల క్రితం కొండపోచమ్మ అమ్మవారు ఇక్కడ కొలువైనట్లు ప్రతీతి. 2001లో దేవాలయాన్ని పునర్‌నిర్మించారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి 13 వరకు ఆలయం యొక్క 24వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లను చేస్తున్నారు.



దేవాలయంలో కొలువుదీరిన కొండపోచమ్మ అమ్మవారు

ఏర్పాట్లు పూర్తి



కొండపోచమ్మ ఆలయ 24వ వార్షికోత్సవ వేడుకలకు ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు చేశాం. వేడుకలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులను కల్పిస్తున్నాం. వార్షికోత్సవ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలి.

-ఆలయ ఛైర్ పర్సన్ అనుగీత